క్లుప్తంగా

'జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

భైంసాటౌన్: జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.దేవిదాస్ ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ జర్నలిస్టులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తగిన తగిన గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం

భైంసాటౌన్: భైంసా డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఎన్నికలో అధ్యక్షుడిగా బామ్ని అనిల్, ఉపాధ్యక్షుడిగా షేక్ ఇస్మాయిల్, పీఆర్ఓగా జెల్ల శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీగా షేక్ హయాత్, క్యాషియర్‌గా గంధం వెంకట్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వారిని కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

వీడీసీ కార్యవర్గం

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామంలో వీడీసీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సర్పంచ్ మోరె ఆనంద్ రావు పటేల్, ఆత్మ మాజీ చైర్మన్ సవ్వి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిందె ఆనంద్ రావు, ఉపాధ్యక్షుడిగా మెల్ల సాయిలు, కోశాధికారిగా సవ్వి తిరుపతిరెడ్డి, సభ్యులుగా వెంకటి, ఆనందరావు, భూమన్న, చిన్నన్న, మహేందర్, అశోక్‌ను ఎన్నుకున్నారు.

విరాళం అందజేత



విరాళం ఇస్తున్న రమణారావు దంపతులు

కుంటాల: మండలంలోని కల్లూర్ ధర్మశాస్త ఆలయ మండపం పునర్నిర్మాణానికి కుంటాల మాజీ ఎంపీపీ అరుణ రమణారావు దంపతులు రూ.11వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ గురుస్వామి నర్సారెడ్డికి నగదు అందజేశారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

నేడు సమావేశం

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర ఏర్పాట్లపై సోమవారం ఉదయం 10:30 గంటలకు మండలంలోని ఆయా గ్రామాల భక్తులు, వలంటీర్లు, అధికారులతో ఆలయం వద్ద సమీక్ష నిర్వహించనున్నట్లు ఈఓ రవికిషన్ గౌడ్ తెలిపారు. దీనికి అధికారులు, వలంటీర్లు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

కడెం: మండలంలోని కన్నాపూర్ గ్రామ సర్పంచ్ లోక నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు తక్కెల సత్తన్న బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకటించారు. త్వరలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్‌లో చేరుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కన్నె శ్రీనివాస్, పాకనాటి రాజేశ్వర్, గంగరాజం, రాజు, సతీశ్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులకు అన్యాయం

ఖానాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తోందని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లో గ్రూప్–2 అభ్యర్థి ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానన్న సీఎం ఆత్మహత్యల తెలంగాణగా మార్చాడని ఆవేదన వ్యక్తం చేశారు.

అబ్దుల్ కలాం చూపిన బాటలో నడవాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

కడెం: యువత అబ్దుల్ కలాం చూపిన బాటలో నడవాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ సలీం, షేక్ అన్వర్, అబ్దుల్ వహీద్, బాబర్, ఆరిఫ్, సమీర్ తదితరులు ఉన్నారు.

సేటు చెప్పిందే రేటు

- రోజురోజుకూ తగ్గుతున్న మొక్కజొన్న ధరలు
- ఆందోళనలో రైతులు
- కొనుగోలు కేంద్రాల ఊసెత్తని ప్రభుత్వం
- పంటను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటూ నష్టపోతున్న వైనం



లోకేశ్వరంలో మక్కలను ఆరబెట్టిన రైతు

లోకేశ్వరం: మొక్కజొన్న పంటకు రోజురోజుకూ ధర తగ్గుతుండటంతో సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో కొన్ని చోట్ల పంట కోతలు పూర్తవగా.. మరికొన్నిచోట్ల ఇప్పుడే ప్రారంభమయ్యాయి. గతంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులకు మద్దతు ధర దక్కింది. ఈసారి అధికారులు, పాలకులు కొనుగోలు కేంద్రాల ఊసెత్తడం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారులు ఇష్టారాజ్యంగా తక్కువకు పంటను కొంటున్నారు. క్వింటాల్‌కు రూ.1860 వరకు మాత్రమే ధర చెల్లిస్తుండటంతో తాము నష్టపోతున్నామని.. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

వేసవిలో ప్రభుత్వ ధర రూ.1960..

జిల్లాలో వానాకాలంలో 18వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. గతంలో సోయా పంటకు తెగులు సోకడంతో ఈసారి ఎక్కువ మంది మొక్కజొన్న సాగుకే మొగ్గు చూపారు. అధిక వర్షాల కారణంగా ఈసారి దిగుబడులు కూడా తగ్గాయి. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు వేసవిలో 45 మొక్కజొన్న కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటాల్‌కు రూ.1960 చెల్లించింది. ఈసారి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రైవేటు వ్యాపారులు చెప్పిందే వేదం అవుతుంది.

మద్దతు ధర చెల్లించాలి..

కేంద్ర ప్రభుత్వం ఇటీవల మొక్కజొన్న పంటకు క్వింటాల్‌కు ధర రూ.2090 ప్రకటించింది. కానీ మార్కెట్‌లో ధర లేదని తక్కువకు వ్యాపారులు కొంటుండటంతో ఏం చేయాలో తెలియడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తమ సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అయినా అందించాలని కోరుతున్నారు.

వారంలో రూ.140 తగ్గుముఖం..

గడిచిన వారం రోజుల్లో క్వింటాలుకు ధర రూ.140 తగ్గింది. పంటలను నిజామాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లే స్తోమత లేకపోవడంతో తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. రైతుల అమాయకత్వాన్ని అసరా చేసుకుంటున్న వ్యాపారులు పంటను క్వింటాల్‌కు రూ.1800లకే కొంటున్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి



మక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. వేసవి కంటే ఇప్పుడు తక్కువకు పంటను కొంటున్నారు. ఈసారి అధిక వర్షాలతో దిగుబడులు కూడా తగ్గాయి. రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2500 చెల్లించాలి.

– గోవింద్, రాయాపూర్‌కాండ్లీ

రూ.1860కే అమ్ముకున్నా



నేను మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేయడంతో 60 క్వింటాళ్ల పంట చేతికొచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు క్వింటాల్‌కు రూ.1860కే విక్రయించా. గతంలో కంటే ఈసారి పంట ధర తగ్గింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలి.

– నగేశ్, నగర్‌తండా

ఉన్నతాధికారులకు నివేదించాం

జిల్లాలో మొక్కజొన్న పంటల కోతలు ప్రారంభమయ్యాయి. రైతుల వినతి మేరకు కొనుగోలు కేంద్రాల విషయమై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. వారి నుంచి ఆదేశాలు రాగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి

- ఖనాపూర్ మండలం తర్లపాడ్ అటవీ శివారులో ఘటన



వృద్ధుడి మృతదేహం

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామశివారు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఖానాపూర్ సీఐ మోహన్ తెలిపారు. సుమారు 60 నుంచి 70 ఏళ్ల వయసు కల్గిన వ్యక్తి ఉరేసుకొని మృతి చెందిన విషయాన్ని అటవీ సిబ్బంది గమనించి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారని పేర్కొన్నారు. ఘటనాస్థలానికి వెళ్లి చూడగా వ్యక్తి ఉరేసుకొని చనిపోయిన తీరు అనుమానాస్పదంగా ఉందని సీఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 87126 59523, 87126 59524 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

మద్యం పట్టివేత.. కేసు నమోదు



దస్తురాబాద్: మద్యం పట్టుకున్న పోలీసులు



నిర్మల్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

దస్తురాబాద్: బెల్టుషాప్‌ల ద్వారా మద్యం అమ్మితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మున్యాల గ్రామంలో బెల్టుషాప్ నిర్వహిస్తున్న సాయిని నరేశ్ కిరాణంపై దాడి చేసి రూ.8,490 విలువైన మద్యం స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రావణ్, లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

రూ.15వేల మద్యం పట్టివేత

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామంలో ఓ బెల్ట్‌షాపులో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు లోకేశ్వరం ఎస్సై సాయికుమార్ తెలిపారు. అక్కడ స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.15,231 ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహలింగిలో మద్యం పట్టివేత

తానూరు: మండలంలోని మహలింగి గ్రామంలో ఆదివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి రూ.తొమ్మిది వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు మహలింగిలో ఓమ్ని రాజన్న నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై దాడి చేసి మద్యం బాటిళ్లను పట్టుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొనసాగుతున్న తనిఖీలు

నిర్మల్‌టౌన్: పట్టణ శివారులోని రెడ్డి ఫంక్షన్‌హాల్ చౌరస్తా వద్ద ఆదివారం పట్టణ ఎస్సై సుమలత ఆధ్వర్యంలో, బస్టాండ్ వద్ద ట్రాఫిక్ ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్సై మాట్లాడుతూ ప్రయాణికులు రూ.50వేల కంటే ఎక్కువ నగదు వెంట తీసుకెళ్తే ఆధారాలు ఉంచుకోవాలని సూచించారు. తనిఖీ సమయంలో పోలీసులకు సహకరించాలని వాహనదారులను కోరారు. కార్యక్రమంలో పట్టణ పోలీసులు ఉన్నారు.

రామ రామ రామ ఉయ్యాలో..



భైంసారూరల్: కోతల్‌గాంలో



కుభీర్: పార్డి(కె)లో బతుకమ్మలతో మహిళలు

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం, మహాగాం, పేండ్‌పెల్లి, తిమ్మాపూర్, ఇలేగాం, సిరాల, లింగా, చుచుంద్ సిద్దూర్, మిర్జాపూర్ తదితర గ్రామాల్లో ఆదివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ పాటలు పాడుతూ సందడిగా గడిపారు. అనంతరం సమీపంలోని చెరువులు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

కుభీర్: మండలంలోని హల్దా, పార్డి(కె), కస్రా తదితర గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా కోలాటం వేస్తూ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆడి పాడారు.

ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి



ఐలమ్మ విగ్రహం ఆవిష్కరిస్తున్న నాయకులు

తానూరు: సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐలమ్మ ఉత్సవ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుంకేట పోశెట్టి అన్నారు. ఆదివారం మండలంలోని భోసి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ట్యాంక్ బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉత్తం బాలేరావ్, సర్పంచ్ ఆనంద్, రజక సంఘం అధ్యక్షులు బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో సంఘం ఏర్పాటు చేసుకోవాలి



లోకేశ్వరంలో మాట్లాడుతున్న కేశవదాస్

లోకేశ్వరం: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పద్మశాలి సంఘం ఏర్పాటు చేసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర సభ్యుడు, హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది రావుల కేశవదాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని లక్ష్మి కల్యాణ మండపంలో మండలంలోని పద్మశాలి సంఘ సభ్యులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పద్మశాలీలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

మండల కార్యవర్గం

ఈ సందర్భంగా పద్మశాలి సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం మండల అధ్యక్షుడిగా సాయన్న, గౌరవ అధ్యక్షుడుగా పోశెట్టి, ఉపాధ్యక్షులుగా అల్లం అశోక్, ప్రవీణ్, కోశాధికారిగా రత్నాకర్, కార్యదర్శిగా పండరి, సహాకార్యదర్శిగా భూమన్నను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్యాం, గంగాధర్, భూమన్న, నర్సయ్య, గంగాధర్, భైంసా సాయన్న, నగేష్, భోజారాం, ధర్మన్న, నారాయణ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో ఇటీవల కొలువులు సాధించిన సంధ్యారాణి, మధుకర్, సాయికిరణ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది కేశవదాస్ హాజరై మాట్లాడారు. పద్మశాలీలు సంఘటితంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఆ సంఘం కన్వీనర్ గుద్దేటి గంగాధర్, ఉపాధ్యక్షుడు పల్లికొండ గజేందర్, సభ్యులు జక్కని గజేందర్, బోగ గోవర్ధన్, ఎస్.గంగయ్య, వై.రాములు, గజేందర్, గంగయ్య, నారాయణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రచారం ప్రారంభం

నిర్మల్‌టౌన్: బీఆర్ఎస్ మ్యానిఫెస్టో సబ్బండ వర్గాలకు న్యాయం చేసేలా ఉందని ఆ పార్టీ యువ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. మ్యానిఫెస్టో విడుదల, నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇంద్రకరణ్‌రెడ్డికి బీఫారం ఇచ్చిన సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం నుంచి మంచిర్యాల చౌరస్తా మీదుగా వీధుల్లో మంత్రి నివాసం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ ప్రచార రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, రాజేందర్, అల్లోల మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, లక్ష్మణచారి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్మల్‌రూరల్ మండలం తల్వేద గ్రామానికి చెందిన 35 మంది బీజేపీ నాయకులు ఆదివారం గౌతమ్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అల్లోల తిరుపతిరెడ్డి, తల్వేద మాజీ సర్పంచ్ పద్మ శ్రీనివాస్, నరేందర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో ప్రచార రథం ప్రారంభిస్తున్న నేతలు

కొలువుదీరిన దుర్గామాత



ఖానాపూర్: పద్మావతినగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో అమ్మవారు



భైంసాటౌన్: గణేశ్‌నగర్‌లోని మండపం వద్ద



లోకేశ్వరం: ధర్మోరలో దీక్షాపరుల పూజలు



తానూరు: ఎల్విలో పూజలు చేస్తున్న భక్తులు



సోన్: న్యూవెల్మల్‌లో..

ఖానాపూర్/భైంసారూరల్/భైంసాటౌన్/సోన్/ లోకేశ్వరం/కుంటాల/లక్ష్మణచాంద /నిర్మల్‌ఖిల్లా: దేవీ శరన్నవరాత్రులు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మండపాల్లో అమ్మవారి ప్రతిమలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమకు ఆయురారోగ్యాలను, ఐశ్వర్యాలను కల్గించాలని జగన్మాతను భక్తులు వేడుకున్నారు. అంతకుముందు ఆయా గ్రామాల్లోని ఆలయాల నుంచి మండపాల వద్దకు విగ్రహాలను తీసుకెళ్లి ప్రతిష్ఠించారు. పలువురు అమ్మవారి దీక్ష స్వీకరించారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు



ఖానాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



సారంగపూర్‌లో..



లక్ష్మణచాందలో నినాదాలు చేస్తున్న నాయకులు

కుంటాల: ముథోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించుకుంటామని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొన్నారు. ఆదివారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా విఠల్‌రెడ్డి బీఫాం అందుకున్న సందర్భంగా కుంటాలలో బీఆర్ఎస్ నేతలు సంబురాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ కన్వీనర్ పడకంటి దత్తాద్రి, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేష్, సర్పంచ్‌లు ప్రదీప్ కుమార్, ఆనందరావు పటేల్, హైమద్, శంకర్‌గౌడ్, అనిల్, గోపాల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: సీఎం కేసీఆర్.. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి బీ ఫారం అందజేయడంపై బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో సంబురాలు చేసుకున్నారు. ఈసందర్భంగా టపాసులు కాలుస్తూ స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాధవరావు, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): నిర్మల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇంద్రకరణ్‌రెడ్డి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫారం తీసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశ్, కొండ్ర రమేశ్, గంగారెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పరిమి సురేశ్, రామునాయక్, కిశోర్, సంతోష్, శంకర్, శ్రీనివాస్, గంగాధర్, రాజేశ్వర్, ప్రవీణ్, రాజేందర్, సత్యం, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను సీఎం కేసీఆర్ విడుదల చేయడంతో మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్, నారాయణ, సిరాజ్, గంగాధర్, భూమన్న, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

తానూరు: సీఎం కే సీ ఆర్ చేతుల మీదుగా బీ ఫారం అందుకున్న ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని మండలంలోని ఆ పార్టీ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మొగ్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.